Sree sreenivasa gadya meanings

శ్రీనివాస గద్యము

(తెలుగులో ప్రతి పదార్థము)

డా. తాడేపల్లి పతంజలి

అసోసియేట్ ప్రొఫెసర్ ఇన్ తెలుగు

పటాన్ చెరు

మెదక్ జిల్లా

9866691587

(శ్రీశైల శ్రీరంగాచార్యులు 19 వశతాబ్దములో శ్రీనివాసగద్యాన్ని వ్రాసారు. ఆ గద్యాన్ని తిరుప్పావడసేవ సమయములో (అన్నరాశి పెట్టు సేవ) పాడతారు.దీని ప్రతి పదార్థములు వివరించు అక్షర సేవ ఇది.)

1.శ్రీమదఖిల మహీమండల మండన ధరణిధర మండలాఖండలస్య,

శ్రీమత్ =సంపద గలవాఁడు; ఒప్పిదము గలవాఁడు.

అఖిల = సమస్త

మహీమండల = దేశములను

మండన = ఆభరణములుగా ధరించిన

ధరణిధర = భూమిని ధరించిన

మండలాఖండలస్య = వరాహావతారుడైన వేంకటేశ్వరునికి నమస్కారము.

2.నిఖిల సురాసుర వందిత వరాహ క్షేత్ర విభూషణస్య

నిఖిల =సర్వ

సురాసుర =దేవతలచే , రాక్షసులచే

వందిత = నమస్కరింపఁబడినవాఁడు;2. స్తుతింపఁబడినవాఁడు అయిన

వరాహ క్షేత్ర =వరాహ క్షేత్రమునకు(తిరుమలకు)

విభూషణస్య = అలంకారముగా నిలిచిన వేంకటేశ్వరునికి నమస్కారము.

3.శేషాచల గరుడాచల సింహాచల వృషభాచల నారాయణాచలాంజనా చలాది శిఖరి మాలాకులస్య

శేషాచల గరుడాచల వృషభాచల

నారాయణాచలాంజనా చలాది =శేషాచలము, గరుడాచలము, సింహాచలము,వృషభాచలము, నారాయణాచలము, అంజనా చలము మొదలయిన

శిఖరి మాలాకులస్య = కొండల సమూహము కలిగిన వేంకటేశ్వరునికి నమస్కారము

4.నాథముఖబోధనిధివిధిగుణసాభరణసత్త్వనిధితత్త్వనిధి భక్తి గుణపూర్ణ శ్రీ శైల పూర్ణ గుణవశంవద

పరమ పురుష కృపా పూర విభ్రమదతుంగశృంగ గలద్గగన గంగాసమాలింగితస్య

నాథముఖబోధనిధివిధిగుణసాభరణ= =శ్రీ వైష్ణవ సాంప్రదాయాన్ని స్థాపించిన వైష్ణవ మతాచార్యులైన

నాథ ముని యొక్క మోమునుండి వెలువడిన అనేక బోధలనే గుణ విధులకు ఆభరణములాంటి వాడా!

సత్త్వనిధి = సత్వగుణమునకు నిధివంటి వాడా!

తత్త్వనిధి = దేనిమీద ఇతర సత్యములు ఆధారపడి యుండునో అట్టి మౌలిక సత్యమునకు నిధి వంటి వాడా !

భక్తి గుణపూర్ణ = భక్తికి సంబంధించిన గుణములతో నిండిన వాడా!

శ్రీ శైల పూర్ణ =శ్రీ శైల పూర్ణుడను ఆచార్యుని యొక్క

గుణవశంవద = గుణములకు విధేయుడా!

పరమ పురుష = పరమాత్మా!

కృపా పూర =దయా ప్రవాహముతో

విభ్రమత్ = చలిస్తూ, భ్రమను కొల్పుతూ

అతుంగశృంగ గలద్గగన గంగాసమాలింగితస్య= విస్తారమైన కొండ కొమ్మునుండి జారుతున్న ఆకాశ గంగచే కౌగిలింపబడిన వాడా ! వేంకటేశ్వరా ! నమస్కారము.

5.సీమాతిగ గుణ రామానుజ ముని నామాంకిత బహుభూమాశ్రయ సురధామాలయ వనరామా

యత వనసీమాపరివృత విశంకటతట నిరంతర విజృంభిత భక్తిరసనిర్భరానంతాహార్య

ప్రస్రవణ ధారాపూరవిభ్రమద సలిలభర భరితమహాతటాకమండితస్య,

స్వామివారి ఆలయానికి పక్కనే ఉన్న పుష్కరిణి అనే పేరు కలిగిన తటాకము గురించి ఈ పంక్తులలో విశేషాలతో చెబుతున్నారు

సీమాతిగ గుణ= పుష్కరిణి అను తటాకము ఎల్లలు దాటిన గుణములు కలిగిన. (సీమాతిగ గుణ)

రామానుజ ముని నామాంకిత= రామానుజులు అను పేరు కలిగిన ముని శ్రేష్ఠునిచే కొలువబడినది.

అనంతాచార్యులు వారు రచించిన ఇతిహాస మాలలో రామనుజులు పుష్కరిణికి సంబంధించి. అనేక పురాణాలనుంచి అనేక పురాణాలనుంచి ఆధారాలు చూపించి , తిరుమలలోని ధృవ బేరము వేంకటేశుడే కాని ఇతర దైవము కాదని నిరూపించారు. అందువల్ల ఈగద్య రచించిన శ్రీ శైల శ్రీరంగాచార్యులవారు ఈ పుష్కరిణిని రామానుజ ముని నామాంకితమని(రామానుజులు అను పేరు కలిగిన ముని చే ఎంచబడినది) పేర్కొన్నారు.

బహుభూమాశ్రయ

సామ్యం లేని అనుభవ రూపమైన బ్రహ్మ పదార్థమును భూమము అంటారు. అటువంటి అనేకమైన భూమములకు నిలయము ఈ పుష్కరిణి. అంటే నిజమైన భక్తిలో ఉన్నవారికి , తనలో స్నానము చేసిన వారికి ఆ వేంకటేశుడనే బ్రహ్మ పదార్థఅనుభవాన్ని ఈ పుష్కరిణి కలిగిస్తుందని అని ఒక అర్థము. భూమమంటే ఐశ్వర్యము కనుక ఈ పుష్కరిణిలో స్నానము చేసిన వారు ఐశ్వర్యవంతులవుతారని ఇంకో అర్థము.

సురధామాలయ వనరామాయత

పుష్కరిణి తీర్థము దేవతల నివాసమైన స్వర్గంలో ఉన్న నందనవనము కంటే మనోహరంగా ఉన్న ,

వనసీమాపరివృత

విశాలమయిన అడవి ప్రాంతాలతో పుష్కరిణి చుట్టబడినది అని ఇంకోఅర్థం. ఇప్పుడంటే పుష్కరిణి సమీపములో మనకు అడవి కనిపించటము లేదు. మన సౌకర్యాల కోసం అడవికి పుష్కరిణి కి మధ్య దూరం పెంచాం. కాని శ్రీ శైలశ్రీరంగాచార్యులవారు అడవికి బాగా దగ్గరగా పుష్కరిణిని చూసారేమో !అందుకే వనరామాయత అన్నారు.

విశంకటతట

గొప్పదైన ఒడ్డు కలది పుష్కరిణి అని ఈ సమాసానికిఅర్థం.

నిరంతర విజృంభిత భక్తిరసనిర్భరా నంతాహార్య

ఎప్పుడూ ప్రవహించే (వికసించే) భక్తి రస పు కొండకాలువలతో మేరలేని తీసుకొని రాదగినది.

ప్రస్రవణ ధారాపూరవిభ్రమద సలిలభర భరిత

కొండయూటల ధారలచే అంతటానిండిన, వ్యాపించినవిలాసములు కల నీటి అతిశయముతో పూరించబడిన అని ప్రతి పదార్థము.

వివరణ

ఈపుష్కరిణి కొలనులో స్నానము చేసే భక్తుల భక్తి కొండ యూటలవంటిది. తనలో స్నానము చేసే భక్తుల భక్తి ప్రవాహాలను కూడా తనలో కలుపుకొని, అంచుల మేర దాటిపోయి పైకి పుష్కరిణి అందంగా ఎగసి ఎగసి పడుతున్నదని కవి భావము.

పుష్కరిణి నీళ్లు ఉన్నతంగా ఎగిరిపడుతున్నాయన్న దానిని కవి ఇలా అందంగా చెప్పాడు.

మహాతటాకమండితస్య

పుష్కరిణి అను గొప్ప కొలనుతో అలంకరించబడిన వేంకటేశునికి నమస్కారము.

6.కలికర్దమ మలమర్దన కలితోద్యమవిలసద్యమనియమాదిమమునిగణ నిషేవ్య మాణ ప్రత్యక్షీ

భవన్నిజసలిల సమజ్జన నమజ్జన నిఖిల పాపనాశన పాపనాశన తీర్థాధ్యాసితస్య

పాపనాశన తీర్థము చేత అధిష్ఠింపబడిన (ఆశ్రయించబడిన) వేంకటేశుని ఈ పంక్తులలో కవి వర్ణిస్తున్నాడు.

ఆ పాప నాశన తీర్థము ఇలాంటిది

కలికర్దమ మలమర్దన

4,32,000 సం.ల కాలపుటవధిగల కలికాలమునకు సంబంధించిన బురదవంటి దోషములను నశింపచేసేది పాప నాశన తీర్థము

కలితోద్యమవిలసద్యమనియమాదిమమునిగణ నిషేవ్య మాణ

పొందబడిన ప్రయత్నముతో ప్రకాశించే యమము, నియమము మొదలైన అష్టాంగ యోగములు ఆచరించే ముని జనుల సమూహముతో చక్కగా సేవింపతగినది పాప నాశన తీర్థము.

వివరణ

యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణ, సమాధులనేవి అష్టాంగ యోగాలు. (యమ నియమాసన ప్రాణాయామ ప్రత్యాహార ధారణ ధ్యాన సమాధ యోష్టావఙ్గాని- పాతఞ్జల యోగ సూత్రమ్ సాధన పాదం) ఇంద్రియాలనుజయించడం, అదుపులో ఉంచడం, అహింసను పాటించడం మొదలైనవి యమ నియమాదులలో ఒక భాగం.. సత్యం, అహింస, ఆస్తేయం, ఆర్జవం (నిజాయితీ), బ్రహ్మ చర్యం, క్షమ, దయ, ధృతి, మితాహారం, శౌచం మొదలైన వాటి వల్ల అంతా బ్రహ్మమే అనిపించి ఇంద్రియ నిశ్చలత కలుగుతుంది.

ప్రత్యక్షీభవన్నిజసలిల సమజ్జన నమజ్జన

కన్ను మొదలైన ఇంద్రియాలతో తనను స్వయంగా తెలుసుకొనటానికి భక్తులకు వీలు కలిగిస్తూ, తన నీటిలో మునిగిన సమాన భావాలు కలిగిన జనులకు, నమస్కరించిన జనులకు పాపాలను పోగొడుతుంది.

పాపనాశన పాపనాశన తీర్థాధ్యాసితస్య

పాపములను నశింపచేసే , పాపనాశనము అను పేరు తీర్థము చేత అధిష్ఠింపబడిన (ఆశ్రయించబడిన) వేంకటేశునికి నమస్కారము.

వివరణ

స్వామి వారి ఆలయానికి ఉత్తరదిశలో 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాపవినాశన తీర్థంలో ఆశ్వీయుజమాసంలో శుక్లసప్తమి రోజున ఉత్తరాషాఢ నక్షత్రం ఉన్న ఆదివారంనాడు పవిత్రస్నానం చేయటం మంచిదంటారు. .ఈ శ్రీనివాస గద్య చదివితే అన్ని వారాల్లోనుఫలితం దక్కుతుందని స్వీయ భావన.

7.మురారి సేవక జరాధిపీడిత నిరార్తిజీవన నిరాశభూసుర వరాతిసుందర సురాంగనా రతి కరాంగ

సౌష్ఠవ కుమారతాకృతి కుమారతారక సమాపనోదయ దనూనపాతక మహాపదామయ విహాపనోదిత సకలభువనవిదిత కుమార ధారాభిధాన తీర్థాధిష్ఠితస్య

మురారి సేవక = విష్ణు సేవకుడయి

జరాధిపీడిత = ముసలితనము మొదలయిన వాటిలో బాధింపబడుతూ

నిరార్తి = బాగా దుఃఖములో

జీవననిరాశభూసురవర = జీవితమందు నిరాశలో జీవిస్తున్న ఒక బ్రాహ్మణ ఘనుడు(ఈ తీర్థములో మునుగుట చేత)

అతిసుందర = శ్రేష్ఠమయిన రూపాన్ని పొంది, బాగా అందగాడై

సురాంగనారతికర = దేవతా స్త్రీలను సైతము మోహింపచేయగల

అంగ సౌష్ఠవ = అవయవ సౌష్ఠవము కల

కుమారతాకృతి = యౌవన రూపము కలిగిన కుమారునిగా మారిపోయాడు

(అందుకే అప్పటినుంచి ఈ తీర్థానికి కుమార తీర్థము అని పేరు వచ్చిందని ఒక కథనం)

కుమార = కుమార స్వామి చేత

తారక = తారకుడను రాక్షసుని

సమాపనోదయ = వధించుట చేత పుట్టిన

(సమాపన+ఉదయత్)

అనూనపాతక = గొప్ప పాపాన్ని

మహాపదామయ = గొప్పదయిన ఆపద అను వ్యాధిని

విహాపన = పోగొట్టుట చేత

ఉదిత = పుట్టిన

సకలభువనవిదిత= అన్ని లోకములకు తెలిసిన

కుమార ధారాభిధాన తీర్థాధిష్ఠితస్య= కుమార ధార అను పేరు కలిగిన తీర్థమును నివాసముగా చేసుకొన్న వేంకటేశ్వరునికి నమస్కారము

విశేషాలు

వజ్రాంగ, వరాంగి దంపతులకు బ్రహ్మ వరము వల్ల తారకుడు అనే రాక్షసుడు జన్మించాడు. పెరిగి పెద్దవాడయిన తారకుడు బ్రహ్మ గురించి తపస్సు చేసి శివ వీర్య సంభూతి చే తప్ప ఇతరుల వల్ల తనకు మృత్యువు లేకుండా వరము పొందాడు.. శివుని గూర్చితపస్సు చేసి పార్థివ లింగమును పొంది గొంతులో ధరించాడు.

శివపార్వతులకు జన్మించిన కుమారస్వామి తారకాసురుని మెడలోని పార్థివ లింగాన్ని ఇదు ఖండాలు చేసాడు. ఈ అయిదు లింగాలను పంచారామాలని పిలుస్తారు.(అమరారామము,ద్రాక్షారామము. కుమారారామము, క్షీరారామము, సోమారామము)

తారకుని సంహరించిన దోషము పోవటానికి కుమారస్వామి మునిగిన తీర్థమే కుమారధారా తీర్థము గా ప్రసిద్ధి పొందింది. ఈ విషయాన్ని ఈ గద్యలో పేర్కొన్నారు.

8.ధరణితల గత సకల హత కలిల శుభ సలిల గత బహుల వివిధమల హతి చతుర రుచిరతర వి

లోకమాత్రవిదళిత వివిధ మహాపాతక స్వామిపుష్కరిణీ సమేతస్య

ఇందులో పుష్కరిణీ తీర్థ వైభవము ప్రస్తావింపబడుచున్నది.

ధరణితల గత =భూభాగములోని

సకల హత = అన్ని రకాలుగా కొట్టబడిన(హింసించిన) బాధలను పోగొట్టేది.

కలిలశుభ = ఎరుగరాని శుభాలను కలిగించేది పుష్కరిణీ తీర్థము.

సలిల గత = నీటిని పొందినది. (నీటిచే తెలియ చేయబడినది.)

బహుల =అధికమైన

వివిధమలహతి చతుర = వివిధరకాలకు చెందిన దోషాలను పోగొట్టుటలో నేర్పు కలది పుష్కరిణీ తీర్థము.

రుచిరతర =మనోహరమైనది

విలోకమాత్రవిదళిత = చూసినమాత్రముచే బా గా ఖండింపబడిన

వివిధ మహాపాతక = అనేక రకములైన మహా పాపములను పోగొట్టే

స్వామిపుష్కరిణీ సమేతస్య= స్వామిపుష్కరిణి అను తటాకముతో కూడుకొని ఉన్న శ్రీ వేంకటేశ్వరునికి నమస్కారము.

9.బహుసంకట నరకావట పతదుత్కట కలికంకట కలుషోద్భట జనపాతక వినిపాతక రుచినాటక

కరహాటక కలశాహృత కమలారత శుభమజ్జన జలసజ్జన భరిత నిజదురిత హతినిరత

జనసతత నిరర్గళపేపీయమాన సలిలసంభృత విశంకట కటూహతీర్థ విభూషితస్య

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో విమాన ప్రదక్షిణ మార్గంలో ఆలయానికి ఆనుకొని ఉత్తరం వైపుగా, అన్నమయ్య పుస్తక భాండారాగానికి ఎదురుగా కటూహ తీర్థం ఉంది ఒక లొట్టి ఆకారంలో ఉంటుంది కనుక దీనిని లొట్టి తీర్థం అని కూడాఅంటారు.గర్భాలయంలో స్వామి వారికి అభిషేకం చేసినప్పుడూ పాదాలనుంచి వచ్చే జలం ఈ కటూహ తీర్థంలోకి వచ్చి చేరుతుంది.ఈ కటూహ తీర్థాన్ని ఈ గద్య వచనములో వర్ణిస్తున్నారు.

బహుసంకట =అనేక కష్టములను

నరకావట = నరకములలో స్నేహములను(ఆవటము= స్నేహము)

పతత్ = మీద పడుచున్న

ఉత్కట = భయంకరమైన

కలికంకట =కలి దృఢత్వాలను

కలుషోద్భట =పాపాధిక్యములు గల

జనపాతక = జనులయొక్క మహాపాపములను (పంచ మహాపాతకములు: స్వర్ణస్తేయము, సురాపానము, బ్రహ్మహత్య, గురుపత్నీగమనము, ఇవి చేయువారితోడి సహవాసము).

వినిపాతక రుచినాటక కర=పతనములను రుచి నాటకాలుగా చేసేది.(కష్టాలను పొగొడుతుందని భావము)

హాటక కలశాహృత =బంగారు కలశాలతో తీసుకొని రాబడి

కమలారత = శ్రీ వేంకటేశునికి ప్రశాంతత నిచ్చే(ఆరతము= ప్రశాంతత)

శుభమజ్జనజల =శుభమయిన స్నానములను కలిగిన నీళ్లు కలిగినది కటూహ తీర్థము.

సజ్జన భరిత = మంచివారితో కూడిన

నిజదురిత హతి= నిజపాపములను పొగొట్టిన

నిరతజనసతత = మిక్కిలి ఆసక్తి కలిగిన జనులచేత

నిరర్గళపేపీయమాన =అడ్డములేకుండా పదే పదే తాగదగిన నీళ్లు కలిగినది కటూహ తీర్థము

సలిలసంభృత = ఆవిధంగా నీటిని ధరించిన

విశంకట =విరివిగల(విస్తృతి కీర్తి)గల

కటాహతీర్థ విభూషితస్య= కటాహతీర్థము అను తీర్థములో అలంకరించబడిన వేంకటేశ్వర స్వామి వారికి నమస్కారము.

10.ఏవమాదిమ భూరిమంజిమ సర్వపాతక గర్వహాపక సింధుడంబర హారిశంబర వివిధవిపుల పుణ్య తీర్థ నివహ నివాసస్య

ఏవమాదిమ =ఈ విధముగా సృష్టిలో మొదటిదయినది.

భూరి =అధికమయినది

మంజిమ = మనోజ్ఞమైనది

సర్వపాతక = అన్ని పాపములను

గర్వహాపక =గర్వములను పోగొట్టునది

సింధుడంబర హారి =ఏరుల విజృంభణము అణచునది.

శంబర = నీటిని కలిగిన

వివిధవిపుల = అనేకరకములైన విశాలమైన

పుణ్య తీర్థ నివహ = మహర్షులు స్నానముచేసిన పుణ్యోదకముల సమూహములుకలిగిన తిరుమలలో

నివాసస్య = శ్రీ వేంకటేశునికి నివాసమయిన

11.శ్రీమతో వేంకటాచలస్య

శ్రీమతః = సంపద కలిగిన

వేంకటాచలస్య = వేంకట పర్వతమునకు నమస్కారము.(వేంకటాచల నివాసుడైన వేంకటేశ్వరునకు నమస్కారము)

12.శిఖరశేఖర మహాకల్పశాఖీ,

శిఖరశేఖర = శ్రేష్ఠమయిన (శేఖర) కొండకొనలో ఉన్న(శిఖర)

మహా = గొప్పదయిన

కల్పశాఖి =కోరినవి ప్రసాదించే దేవ తరువువంటి వేంకటేశ్వరునకు నమస్కారము

13.ఖర్వీభవదతిగర్వీకృత గురుమేర్వీశ గిరిముఖోర్వీధరకులదర్వీకర దయితోర్వీ ధరశిఖరోర్వీసతత సదుర్వీ కృతిచణనవఘనగర్వచర్వణనిపుణ తనుకిరణ మస్పణిత గిరిశిఖరశేఖర తరునికరతి మిరః

ఖర్వీభవత్ =పొట్టిదగుచున్న

అతిగర్వీకృత = బాగా గర్వించిన

గురుమేర్వీశ గిరి =గొప్పదయిన మేరు పర్వతము, కైలాస పర్వతము(మేరు+ ఈశగిరి)

ముఖ =ముఖముగా ఉన్న

ఉర్వీధరకుల = పర్వత సమూహము కలిగిన వేంకటాచలము కలిగిన వాడు

శ్రీవేంకటేశ్వర స్వామి ఉన్న వేంకటాచల పర్వతము - మేరు పర్వత, కైలాస పర్వతముల కంటె గొప్పది అని భావము.

దర్వీకర దయితోర్వీ ధర =శేషునికి ప్రియమైన కొండయొక్క

శిఖరోర్వీ = కొండ కొనలలోని భూమిలో

సతత = ఎప్పుడూ

సదుర్వీ కృతి = బాగ విస్తరించుటలో

చణ = గొప్పదయిన

నవఘన = కొత్త మేఘము యొక్క

శేషాచల పర్వతాన్ని తాకేటట్లుగా మేఘాలు విస్తరించి ఉంటాయని భావము.

గర్వచర్వణ = గర్వాన్ని అనుభవించుటలో

నిపుణ = సమర్థుడయిన

తనుకిరణ =శరీరముయొక్క కాంతి కిరణములతో

నిలమేఘాలకి తాము బాగా నలుపు అని గర్వము. ఆ గర్వాన్ని స్వామి వారి నల్లని శరీరపు రంగు తీసి పడేస్తాయి.

అంటే స్వామి వారి నల్లని శరీరపు రంగు – మేఘాల నల్లని రంగును మించి పోయి ఉన్నదని భావం.

మసృణిత = చిక్కగా చేయబడిన

గిరిశిఖరశేఖర =గొప్పదయిన పర్వతముపై ఉన్న

తరునికరతిమిరః = చెట్ల గుంపుల తో ఏర్పడిన కాంతి కలవాడు.

ఇటు స్వామి వారి శరీరపు నల్లని కాంతులు. అటు మేఘాల నల్లని కాంతులు. వీటికి తోడు ఆ కొండ మీద వ్యాపించిన దట్టమయిన చెట్లతో చికట్ల భ్రమ కొలిపే నల్లదనం. వీటన్నింటితో ఆ వేంకటాచలము నల్లటి చికట్ల మయమయినదని భావం.

14.వాణీపతి శర్వాణీదయితేంద్రాణీశ్వరముఖనాణీయోరసవేణీనిభ శుభవాణి నుతమహిమాణీ యస్తరకోణీ భవదఖిలభువన భవనోదరః

వాణీపతి = సరస్వతీదేవి భర్త అయిన బ్రహ్మ

శర్వాణీదయిత = పార్వతీదేవి భర్త అయిన శివుడు

ఇంద్రాణీశ్వరముఖ = శచీదేవి భర్త అయిన ఇంద్రుడు మొదలయిన వారి

నాణీయోరసవేణీనిభ = గొప్పదయిన (అణీయము అంటే మిక్కిలి చిన్నది.అది కానిది నాణీయము)

రస ప్రవాహములతో సమానమయిన

శుభవాణీ =శుభమయిన మాటలతో

నుతమహిమా = పొగడబడిన మహిమ కలది

అణీయస్తరకోణీ భవత్ =మిక్కిలి చిన్నదానియందు అణగి పోతున్న

అఖిలభువన భవనోదరః = సమస్త లోకములకు స్థానమయిన ఉదరము(= పొట్ట) కలవాడు

శ్రీవేంకటేశ్వరుని ఉదరములో సమస్త లోకములు ఉన్నాయని ,ఆ ఉదరాన్ని బ్రహ్మ, శివుడు, ఇంద్రుడు చక్కటి వాక్కులతో పొగుడుతున్నారని భావము.

15.వైమానిక గురుభూమాధిక గుణ రామానుజకృతధామాకరకరధామారిదర లలామాచ్ఛకనక దామాయిత నిజరామాలయనకిసలయమయ తోరణ మాలాయితవనమాలాధరః

వైమానిక గురు =విమానమెక్కి తిరిగే దేవతల గురువయిన బృహస్పతి యొక్క

భూమాధిక గుణ = బుద్ధి కంటె ఎక్కువ తెలివితేటలు కలిగిన

రామానుజకృత = రామనుజాచార్యుల వారిచే ఇవ్వబడిన

ధామాకర = తేజస్సుకు నిలయమైన

కరధామ =హస్తాలకు ఆశ్రయమైన

అరిదర లలామ =శత్రు భయంకరములైన శ్రేష్ఠములైన శంఖము(=దర) మొదలయిన వాటికి

అచ్ఛకనక దామాయిత =స్వచ్ఛమయిన బంగారు మాల వంటిది

మోకాళ్లవరకు వ్రేళ్లాడుతూ, అన్ని ఋతువులలోనూ పూచే పూలతో, మధ్యన పెద్ద గుచ్ఛంతో విష్ణు మూర్తి మెడలో ఉండే దండను వనమాల, లోమాల అంటారు. రామనుజాచార్యుల వారు శ్రీ వేంకటేశ్వరునికి శంఖ చక్రాలు సమర్పించారని

మనకిప్పుడు కనిపించేవి అవేనని ఒక కథ. రామనుజాచార్యుల వారు సమర్పించిన శంఖ చక్రాలతో కలిసి వేంకటేశ్వరుడు ధరించిన వనమాల బంగారంలా మెరిసిపోతోందని కవి భావన.

నిజరామాలయ =తన భార్య అయిన లక్ష్మీదేవికి నివాసమైన వక్షస్థలానికి

నవకిసలయమయ = కొత్తవయిన చిగుళ్లతో చేయబడిన

తోరణ మాలాయిత = ద్వారబంధములో ఉండే పూల మాలికలా ఉండే

వనమాలాధరః = వనమాలను ధరించిన వేంకటేశ్వరునకు నమస్కారము.

అమ్మవారు నివాసముండే వక్షస్థలమనే ఇంటికి ద్వారములో ఉండే మంగళ తోరణములా వనమాల ఉన్నదని భావము.

16.కాలాంబుదమాలానిభ నీలాలక జాలావృత బాలాబ్జ సలీలామలఫాలాంకసమూలామృత ధారాద్వయావధీరణ

ధీరలలితతర విశదతర ఘన ఘనసారమయోర్ధ్వపుండ్ర రేఖాద్వయరుచిరః,

స్వామి వారి నిలువు నామాలను ఈ చరణంలో వర్ణిస్తున్నారు.

కాలాంబుదమాలానిభ = నల్లని మేఘాల సమూహంతో పోల్చదగిన

నీలాలక = నల్లని కేశముల

జాలావృత =సమూహంతో ఆవరింపబడిన

బాలాబ్జ సలీలా = బాలచంద్రునివంటి

అమలఫాలాంక =స్వచ్ఛమైన నుదుటి భాగము

సమూలా = మూలముగా కల్గి

అమృత ధారాద్వయా = రెండు అమృత ప్రవాహములను

అవధీరణ = హేళన చేయుటలో

ధీర = ధైర్యము కల్గినవి

లలితతర = బాగా అందమైనవి

విశదతర = బాగా స్పష్టమైనవి

ఘన = గొప్పవి

ఘనసారమయ = పచ్చకర్పూరములో దిద్దబడినవి అయిన

ఊర్ధ్వపుండ్ర రేఖాద్వయ = రెండు నిలువుబొట్టులతో

రుచిరః, = ప్రకాశించే వేంకటేశునికి నమస్కారము

తాత్పర్యము

స్వామి వారి నిలువు నామాలు నల్లని మేఘాల సమూహంతో పోల్చదగిన నల్లని కేశముల సమూహంతో ఆవరింపబడిన

బాలచంద్రునివంటి స్వచ్ఛమైన నుదుటి భాగములో ఉంటాయి.

ఆ ఊర్ధ్వ పుండ్రాలు రెండు అమృత ప్రవాహములను హేళన చేయుటలో ధైర్యము కల్గినవి. అమృత ప్రవాహములను మించినవి అని అర్థము.

స్వామి వారి నిలువు నామాలు బాగా అందమైనవి. బాగా స్పష్టమైనవి. గొప్పవి. పచ్చకర్పూరములో దిద్దబడినవి

అటువంటి రెండు నిలువుబొట్టులతో ప్రకాశించే వేంకటేశునికి నమస్కారము

విశేషాలు

అజ్ఞానాన్ని, కర్మపాశాన్ని ఖండించేదానిని పుండ్రం అంటారు.

తెల్ల నామాలు సత్వగుణాన్ని తెలియజేస్తాయి.

అనురాగానికి ప్రతీక లేత ఎరుపు రంగు . లక్ష్మీ స్వరూపానికి గుర్తుగా నిలువు పుండ్రాల మధ్య శ్రీ చూర్ణం పెడతారు.

17.సువికస్వర దళభాస్వర కమలోదర గతమేదుర నవకేసర తతిభాసుర పరిపింజర కనకాంబర కలితాదర లలితోదర తదాలంబ జంభరిపు మణిస్తంభ గంభీరిమదంభస్తంభన సముజ్జృంభమాణ పీవరోరుయుగళ తదాలంబ పృథుల కదలి ముకుళ మదహరణ జంఘాలజంఘాయుగళః,

వేంకటేశ్వర స్వామి వారి పిక్కలను వర్ణిస్తున్న గద్య భాగమిది

సువికస్వర దళ = బాగా వికాసము పొందిన రేకులతో

భాస్వర = ప్రకాశించే

కమలోదరగత = పద్మము లోపల ఉండే

మేదుర నవకేసర = దట్టమైన కొత్త కేసరముల

తతిభాసుర = సమూహము వలె కాంతితో

పరిపింజర = అంతటా ఎరుపు పసుపు వర్ణ కలయిక తో

కనకాంబర = బంగారు వస్త్రము పట్ల

కలితాదర = ఆదరము చూపించు

లలితోదర =సుకుమారమైన నడుము కలది.

స్వామి వారి పిక్కలు బాగా వికాసము పొందిన రేకులతో ప్రకాశించే పద్మము లోపల ఉండే దట్టమైన కొత్త కేసర సమూహ కాంతితో సమానమైన ఎరుపు పసుపు వర్ణములు కలిసిన పింజర వర్ణము తో ఉండే పీతాంబరము ధరించిన సుకుమారమైన నడుముతోకూడుకొని ఉన్నవి.

తదాలంబ = ఆనడుమును ఆధారము చేసుకొని

జంభరిపు మణిస్తంభ = ఇంద్ర నీల మణులు పొదిగిన స్తంభముల

గంభీరిమ దంభ స్తంభన = గంభీరతను, గర్వమును స్తంభింపచేసి

సముజ్జృంభమాణ = బాగా వర్ధిల్లుచున్న

పివరోరుయుగళ = బలమైన తొడలు కలవాడు.

స్వామి వారి ఊరువులు ఇంద్ర నీల మణులు పొదిగిన స్తంభముల గంభీరతను, గర్వమును స్తంభింపచేసి- నువ్వెంత అంటున్నాయి.(అంటే ఇంద్ర నీల మణులు పొదిగిన స్తంభములకంటె స్వామి వారి ఊరువులు అందంగా ఉన్నాయి)

స్వామి వారి పిక్కలు అటువంటి ఊరువులతో కూడుకొని ఉన్నాయని భావము.

తదాలంబ = ఆ ఊరువులను ఆధారముగా చేసుకొని

పృథుల కదలీ ముకుళ = పెద్దవైన అరటి మొగ్గల అందాల

మదహరణ = మదాన్ని హరించుటలో

జంఘాల = బాగా వేగముగా పరుగు తీయగల

జంఘాయుగళః, = రెండు పిక్కలు కలవాడు

అరటి మొగ్గలతో పిక్కలను కవులు పోలుస్తుంటారు. ఈ గద్యభాగంలో అరటి మొగ్గల అందాన్ని మించి స్వామి వారి పిక్కలు ఉన్నాయని కవి వర్ణిస్తున్నాడు.

18.నవ్యదళ భవ్యకల పీతమల శోణిమల సన్మృదుల సత్కిసలయాశ్రుజలకారి బలశోణతల పత్కమలనిజాశ్రయ బలబంధీకృతశరదిందుమండలీ విభ్రమదాదభ్రశుభ్ర పునర్భవాధిష్ఠి తాంగుళీ గాఢనిపీడిత పద్మాసనః

ఈ గద్య భాగంలో వేంకటేశ్వరుని పాదాలు, గోళ్లు, వర్ణన చేస్తున్నారు.

నవ్యదళ = స్వామి వారి పాదాలలో కిందిభాగం కొత్తగా తొడిగిన ఆకులతో

భవ్యకల =శుభాలతో అందమైన.

పీతమల = నిర్మలమయిన

శోణిమ లసన్మృదుల = ఎర్రని రంగుతో ప్రకాశించే సున్నితమైన

సత్కిసలయాశ్రుజలకారి = చిగురుటాకుకు కన్నీళ్లు తెప్పిస్తుంది.

స్వామి వారి పాదాలలో కిందిభాగం - కొత్తగా తొడిగిన ఆకులతో, శుభాలతో అందమైన, నిర్మలమయిన

ఎర్రని రంగుతో ప్రకాశించే సున్నితమైన చిగురుటాకుకు కన్నీళ్లు తెప్పిస్తుంది.అంటే స్వామి వారి పాదాల కిందిభాగం

చిగురుటాకులకంటె అందంగా ఉన్నదని భావం.

బలశోణతల =బలముతో ఎర్రని రంగు భాగముతో

పత్కమల = పాదములను కమలాలు ఉన్నాయి

స్వామి వారి పాదాలు కమలాలుగా ఉన్నాయి.

నిజాశ్రయ = తన ఆశ్రయము యొక్క

బలబందీకృత = బలముతో బందీగా చేయబడిన

శరదిందుమండలి = శరత్కాల చంద్రుల సమూహము యొక్క

విభ్రమదాదభ్రశుభ్ర = భ్రమను కలిగించే తక్కువ కాని శుభ్రమైన

పునర్భవాధిష్ఠి తాంగుళి = గోళ్లతో అధిష్ఠించిన కాలి వేళ్లతో

గాఢనిపీడిత పద్మాసనః = బాగా పీడింపబడిన ఆసన పద్మము కలవాడు.

స్వామి వారి కాలిగోళ్లు శరత్కాల చంద్రుల సమూహాన్ని బందీగా చేసుకొన్నాయి.బందీ చేసుకొన్నవాడు బందీ కంటే

బలవంతుడు. శరత్కాల చంద్రుల సమూహపు తెల్లదనంకంటె స్వామి వారి గోళ్లు బాగా తెల్లగా ఉన్నాయని భావం.ఆ తెల్లటి గోళ్లను స్వామి వారు పద్మాసనంలో బంధిస్తున్నారు.

19.జానుతలావధిలంబివిడంబిత వారణశుండా దండవిజృంభిత నిలమణి మయ కల్పకశాఖా విభ్రమదాయి మృణాళలతాయిత సముజ్జ్వలతర కనక వలయ వల్లి వేల్లితైకతర బాహుదండయుగళః

స్వామి వారి నాలుగు బాహువులలో రెండు బాహువుల వర్ణన (కటి హస్తం, అభయ హస్తం) ఈ గద్య భాగంలో ఉంది.

జానుతలావధిలంబి =మోకాళ్ల వరకు విస్తరించిన

విడంబిత = అనుకరించిన

వారణశుండాదండ = ఏనుగు తొండాన్ని కలిగినవి

విజృంభిత =బాగా అభివృద్ధి చెందిన

నిలమణి మయ = నీల మణులతో కలిసిన

కల్పకశాఖా = కల్ప వృక్ష శాఖ యొక్క

విభ్రమదాయి = భ్రమను కలిగించేవి

మృణాళలతాయిత = నాచు తీగలా ఉన్న

సముజ్జ్వలతర = బాగా ప్రకాశించే

కనక వలయ వల్లి = లతారూపములో ఉన్న బంగారు వలయముతో

వేల్లిత = చుట్టబడిన

ఏకతర బాహుదండయుగళః =రెండు బాహువులలో ఒక బాహుదండ యుగళము కలిగిన వాడు.

తాత్పర్యము

స్వామి వారి కటి హస్తం, అభయ హస్తం మోకాళ్ల వరకు విస్తరించి ఉంటాయి. అవి ఏనుగు తొండాల్లా ఉంటాయి. నీల మణులతో కలిసిన కల్ప వృక్ష శాఖల్లా ఉంటాయి. నాచు తీగలా బాగా ప్రకాశించే బంగారు వలయముతో చుట్టబడి ఉంటాయి. వేంకటేశునికి నమస్కారము

20.యుగపదుదిత కోటిఖరకర హిమకర మండల జాజ్వల్యమాన సుదర్శన పాంచజన్య సముత్తుంగిత శృంగాపరబాహుయుగళః

ఈ గద్య భాగములో సుదర్శన, పాంచ జన్యములను ధరించిన స్వామి వారి రెండూ బాహువులను వర్ణిస్తున్నారు.

అర్థాలు

యుగపదుదిత =ఒకే మాటు పుట్టిన

కోటి = అనేక కోట్ల సంఖ్యలో ఉన్న

ఖరకర = సూర్యుల యొక్క

హిమకర మండల = చంద్రుల యొక్క సమూహముల్లా

జాజ్వల్యమాన = ప్రకాశించే

సుదర్శన పాంచజన్య = సుదర్శన పాంచజన్యములు కలిగినవి

సముత్తుంగిత = బాగా ఎత్తుగా చేయబడిన

శృంగాపరబాహుయుగళః = పర్వత శిఖరాలవంటి రెండు చేతులు కలిగినవాడు.

తాత్పర్యము

స్వామి వారి ఒక చేతిలో ఉన్న సుదర్శన చక్రము అనేకమంది సూర్యుల యొక్క తేజస్సు కలిగినది.

ఇంకొక చేతిలో ఉన్న పాంచజన్య శంఖము అనేకమంది చంద్రుల యొక్క కాంతి కలిగినది.

ఇటువంటి సుదర్శన పాంచజన్యములను పర్వత శిఖరాలవంటి రెండు చేతులతో స్వామి ధరించాడు.

21.అభినవశాణ సముత్తేజిత మహామహానీలఖండ మదఖండననిపుణ నవీన పరితప్త కార్తస్వరకవచిత మహనీయ పృథులసాలగ్రామ పరంపరాగుంఫిత నాభిమండలపర్యంత లంబమానప్రాలంబదీప్తి సమాలంబిత విశాలవక్ష స్థలః

ఈ గద్య భాగములో స్వామి వారి వ క్షః స్థలాన్ని వర్ణిస్తున్నారు.

1.అభినవశాణ = కొత్త ఒరపిడి రాయిపై సాన పెట్టిన

సముత్తేజిత = ఉత్తేజము పొందిన

మహామహానీలఖండ = గొప్పదైన మహా నీలమనే రత్న ఖండము యొక్క

మదఖండననిపుణ = మదాన్ని ఖండించుటలో నేర్పు కలది ;

స్వామి వారి వక్షస్థలము నల్లగా ఉంటుంది.

ఇంద్రనీలమణి నల్లగా ఉంటుంది. దానితో పోలుద్దామా అని కవి అనుకొన్నాడు.

కొత్త గీటు రాయి మీద సాన పెట్టిన ఇంద్రనీలమణి కాంతి ధగా ధగా మెరిసిపోతోంది. అది స్వామి వారి వక్షస్థలము చూసి తను బాగా కాంతిగా ఉన్నాననే గర్వాన్ని పోగొట్టుకొంది అన్నాడు కవి.

స్వామి వారి వక్షస్థలము నిగ నిగ లాడుతూ నల్లగా అందంగా ఉంటుంది.అనేది చెప్పటానికి ఈ పోలిక.

2.నవీన పరితప్త = కొత్తగా కాచి పరిశుద్ధి చేసిన

కార్తస్వరకవచిత = బంగారపు కవచముతో ఆవరింపబడిన

మహనీయ = గొప్పదయిన

పృథుల = పెద్దదైన

సాలగ్రామ = సాలగ్రామ శిలల

పరంపరాగుంఫిత = వరుసలు కలిగినదై

స్వామి వారి వక్ష స్థలంలో సాలగ్రామాలు చాలా ఉన్నాయి. ఆ సాలగ్రామాలు కొత్తగా పుటం పెట్టిన బంగారపు కవచాలను కలిగి ఉన్నాయి. ఆ కాంతిలో స్వామి వారి వ క్షః స్థలం మెరిసిపోతోందని భావం.

నాభిమండలపర్యంత = బొడ్డు వరకు

లంబమానప్రాలంబదీప్తి = వేలాడిన మాలిక కాంతిచే

సమాలంబిత = ఆలంబనము గొన్న

విశాలవక్ష స్థలః = వెడల్పైన వ క్షః స్థలము కలవాడు.

సాలగ్రామాల మాలిక స్వామి వారి బొడ్డు వరకు వేలాడుతోంది. ఆ సాలగ్రామాల మాల కాంతితో స్వామి వారి వ క్షః స్థలం మెరిసిపోతోంది.

22.గంగారుురతుంగాకృతిభంగావలిభంగావహసౌధావలిబాధావహ ధారానిభ హారావళిదూరాహత గేహంతరమోహావహమహిమమస్కృణిత మహాతిమిరః

ఈ గ ద్య భాగములో స్వామి వారు ధరించిన ముత్యాల హారాల శోభను కవి వర్ణిస్తున్నారు.

గంగారుుర = గంగా నది ప్రవాహము యొక్క

తుంగాకృతి = ఎత్తైన ఆకారము కల

భంగావలి = కెరటాల గుంపు యొక్క

భంగావహ = భ్రమను కల్గిస్తాయి

స్వామి వారు ధరించిన ముత్యాల హారాలు తెల్లగా ఉన్నాయి. ఎత్తుగా, తెల్లగా ఎగసిపడే గంగ యొక్క తరంగాల కాంతిని మించిపోయి ఉన్నాయి

సౌధావలి = తెల్లని సౌధముల గుంపుకు

బాధావహ = బాధను కలిగిస్తున్నాయి.

తెల్లని మేడల కాంతిని మించిన తెలుపును స్వామి వారు ధరించిన ముత్యాల హారాలు కలిగి ఉన్నాయని భావము.

ధారానిభ = ముత్యాల హారాలు తెల్లని జలపాతాల కాంతిని మించిపోతున్నాయి

హారావళి = ఆ ముత్యాల హారాల గుంపుల తెల్లని కాంతి

దూరాహత = దూరముగా తరిమివేసిన

గేహంతర = గర్భ గుడిలోని

మోహావహ = భ్రమను కలిగించు

మహిమ = ప్రభావమును

మసృణిత = చిక్కని

మహాతిమిరః = గొప్ప చికటి కలవాడు.

స్వామి వారు ధరించిన ముత్యాల హారాల కాంతి గర్భ గుడిలో వ్యాపించే దట్టమైన చికటిని తరిమికొడుతోంది.

23.పింగాకృతి భృంగారునిభాంగార దళాంగామల నిష్కాసిత దుష్కార్యఘ నిష్కావళి దీపప్రభ నిపచ్ఛవి తాపప్రద కనకమాలికా పిశంగితసర్వాంగః

స్వామి వారి సర్వాంగ శోభను ఈ గద్య భాగములో వివరిస్తున్నారు.

పింగాకృతి(పింగ+ఆకృతి) = ఎర్రని రంగు కలిగిన

భృంగారునిభ = బంగారపు రంగు వంటి

అంగారదళాంగామల = అగ్ని కణములచే అవయవ శుద్ధి కలిగినది

స్వామి వారి అవయవాలు శుద్ధిగా ఉంటాయని భావము.

నిష్కాసిత = దూరానికి పారద్రోలిన

దుష్కార్యఘ(దుష్కారి+అఘ)= పాపుల పాపములు కలిగినది

స్వామి వారి అవయవ సందర్శనతో పాపాత్ముల పాపాలు తొలుగుతాయని భావము.

నిష్కావళి = బంగారు దీనారాలకు

దీపప్రభ - దీపముల కాంతికి

నిపచ్ఛవి = కడిమెపూల కాంతికి

తాపప్రద = తాపమును కలిగిస్తాయి

స్వామి వారి అవయవ కాంతి బంగారు దీనారాల కాంతిని, దీపముల కాంతిని, కడిమెపూల కాంతిని మించి ఉంటుందని భావము.

కనకమాలికా = బంగారు మాలికచే కలిసిన

పిశంగిత= పిశంగపు రంగు కలిగిన

సర్వాంగః= అన్ని అవయవములు కలవాడు

నలుపు, ఎరుపు, పసుపు రంగులు కలిస్తే పిశంగ వర్ణము. ఆరంగుల సమ్మేళనముతో కలిసిన బంగారు మాల రంగు వలె

స్వామి వారి అవయవ శోభ ఉంటుందని భావం.

24.నవదళిత దళవలిత మృదులలిత కమలతతి మదవిహతి చతురతర పృథులతర సరసతర కనకసర మయరుచిర కంఠికా కమనీయకంఠః

స్వామి వారి కంఠాన్ని అలంకరించిన కంఠాభరణ వర్ణనము ఈ గద్యలో చేస్తున్నారు.

నవదళిత = కొత్తగా విచ్చుకొన్న

దళవలిత = రేకులతో చుట్టబడియున్న

మృదులలిత = మెత్తనైన అందమైన

కమలతతి =తామర పూవుల సమూహము యొక్క

మదవిహతి = గర్వాన్ని పోగొట్టుటలో

చతురతర =మిక్కిలినేర్పు కలదయిన

పృథులతర = బాగా పెద్దదయిన

సరసతర = మిక్కిలి సరసమయిన

కనకసర మయ = బంగారు సరములతో కూడుకొన్న

రుచిర కంఠికా = అందమైన కంఠాభరణముచే

కమనీయకంఠః = సుందరమైన కంఠము కలవాడు (మా వేంకటేశుడు . వానికి నమస్కారము.)

తాత్పర్యము

స్వామి వారి కంఠాభరణము బంగారు తామరపూవులతో ఉంది.

కొత్తగా విచ్చుకొన్న , సుకుమారమైన, అందమైన కమలాల కాంతి కంటె స్వామి వారి కంఠాభరణములోని బంగారు తామరపూవుల శోభ ఎక్కువని భావము.

25.వాతాశనాధిపతిశయన కమనపరిచరణ రతిసమేతాఖిల ఫణధరతతి మతికర కనకమయ నాగాభరణ పరివితాఖిలాంగావగమిత శయనభూతాహిరాజ జాతాతిశయః

వాతాశనాధిపతిశయన = గాలిని ఆహారంగా స్వీకరించే ఆదిశేషుని పడుకలో

కమనపరిచరణ = కోరికను కలిగిన స్వామి సేవలో

రతిసమేత = ఆసక్తితో కూడుకొని ఉన్న

అఖిల ఫణధరతతి = అన్ని పాముల సమూహమా అను

మతికర = భావనను కలిగించే

కనకమయ = బంగారములో కూడుకొన్న

నాగాభరణ పరివిత = నాగా భరణములను అలంకారములలో

అఖిలాంగావగమిత = అన్ని అవయవాలలో తెలిసికొనబడిన

శయనభూత +అహిరాజ = పడుకగా ఉన్న ఆదిశేషునివల్ల

జాతాతిశయః = పుట్టిన అతిశయము కలిగినవాడు

తాత్పర్యము

వేంకటేశ్వర స్వామి వారి శరీరము మీద నాగా భరణాలున్నాయి. అవి అన్ని రకాల సర్పాలు స్వామి శరీరము మీద ఉన్న భ్రాంతిని కలిగిస్తున్నాయి. పాములన్ని కూడా స్వామి వారిని సేవించాలనే తపనతో ఆయనకు నాగాభరణాలయ్యాయి.

విశేషము

నాగా భరణుడు శివుడు కనుక ఈ వర్ణన ద్వార శివ కేశవులకు అభేదమని గద్య కర్త చెప్పినట్లు భావించవచ్చు.

26.రవికోటి పరిపాటి ధరకోటిర వరాటికితవాటిరసధాటి ధరమణిగణ కిరణ విసరణ సతతవిధుత తిమితమోహగర్భగేహః,

రవికోటి పరిపాటిధర=అనేక సూర్య కాంతుల పోలికను ధరించిన

కోటిర వర = గొప్పదైన కిరీటములోని

ఆటికితవాటి = తెలియచేయబడిన తమ స్థానాలలోని

రసధాటిధర = శుభము యొక్క గొప్పతనాన్ని ధరించి

మణిగణ కిరణ విసరణ= అనేక మణుల కిరణాల వ్యాప్తితో

సతతవిధుత= ఎప్పుడూ దూరంగా తరిమి వేయబడిన

తిమితమోహగర్భగేహః,= చికట్ల ద్వార వచ్చే మోహ భ్రాంతిని ఉన్న గర్భ గృహము కలవాడు.

తాత్పర్యము

స్వామి వారి కిరీటం అనేక సూర్యుల కాంతిని కలిగినది. ఆ కిరీటములోని మణుల కాంతితో స్వామి వారి గర్భ

గృహములోని చికటి అంతా బయటికి పోతోంది.

27.అపరిమిత వివిధభువనభరితాఖండ బ్రహ్మాండమండల పిచండిలః

అపరిమిత= పరిమితి లేని

వివిధభువనభరిత= అనేక లోకాలలో నిండిన

అఖండ బ్రహ్మాండమండల= అన్ని బ్రహ్మాండ మండలాలు కలిగిన

పిచండిలః= గొప్ప ఉదరము కలవాడు

తాత్పర్యము

స్వామి వారి ఉదరములో అనేక బ్రహ్మాండములు ఉన్నాయని భావము

విశేషము

బ్రహ్మాండమంటే ప్రపంచము. ఆకాశానికి శబ్ద గుణము ఉంది. వాయువుకి శబ్ద, స్పర్శ గుణాలు ఉన్నాయి.అగ్నికి శబ్ద, స్పర్శ రూప గుణాలు ఉన్నాయి. నీటికి శబ్ద, స్పర్శ రూప, రస గుణాలున్నాయి. భూమికి శబ్ద, స్పర్శ రూప, రస , రస గంధగుణాలున్నాయి.ఇవన్ని కలిస్తే బ్రహ్మాండమైందని బ్రహ్మ పురాణంలో ఉంది. (23 వ అధ్యాయము) ఈ బ్రహ్మాండము వెలగ పండు విత్తనంలా ఉంటుందని పోలిక చెప్పారు. ఈ మానవ శరీరము బ్రహ్మాండము యొక్క సూక్ష్మ రూపం. హరి బ్రహ్మాండములోవ్యాపించినట్లే ఈ శరీరములో కూడా వ్యాపించి హృదయ సీమలో అలంకరించి ఉంటాడని ప్రశ్నోపనిషత్తు చెబులోంది. (ఆరవ అధ్యాయము)

ఇటువంటి బ్రహ్మాండాలు వేలకు వేలు . ఇవన్ని హరిలోపల ఉన్నాయని అన్నమయ్య 'హరిలోనివే బ్రహ్మాండంబులు' అన్నాడు. (భావములోన కీర్తన) ఈ గద్య కర్త కూడా అదే మాట చెబుతున్నాడు.

28.ఆర్యధుర్యానంతార్య పవిత్రఖనిత్రపాత పాత్రీకృత నిజచుబుకగత వ్రణకిణ విభూషణవహన సూచితశ్రిత జనవత్సలతాతిశయః

ఆర్యధుర్యానంతార్య= ఆచార్య శ్రేష్ఠుడైన అనంతాచార్యుల వారి

పవిత్రఖనిత్రపాత= పవిత్రమైన గడ్డపార దెబ్బకు

పాత్రీకృత = పాత్రముగా చేయబడిన

నిజచుబుక గత వ్రణకిణ= తన గెడ్డములోని గాయపు గుర్తును

విభూషణవహన=గొప్ప అలంకారముగా కలిగి యుండుట ద్వార

సూచితశ్రిత జనవత్సలతాతిశయః= సూచింపబడిన , అతిశయమైన భక్త వాత్సల్యము కలవాడు.

ఆచార్య శ్రేష్ఠుడైన అనంతాచార్యుల వారి పవిత్రమైన గడ్డపార దెబ్బకు స్వామి వారి గెడ్డములో గాయపు గుర్తు

ఒక అలంకారముగా ఉన్నది. ఆ గుర్తు ద్వార భక్త వాత్సల్యమును స్వామి వారు సూచిస్తున్నారు..

29.మడ్డుడిండిమ డమరుఝర్ ఝర కాహళి పటుహావళి మృదుమర్దలాలి మృదంగ దుందుభి ఢక్కికాముఖ హృద్యవాద్యక మధుర మంగళ నాదమేదుర విస్ఫుమర సరసగాన రసరుచిర సంతతసంతన్యమాన నిత్యోత్సవ పక్షోత్సవ మాసోత్సవ సంవత్సరోత్సవాదివివిధోత్సవ కృతానందః

మడ్డు= మడ్ అని శబ్దాన్ని చేసే వాద్యము

డిండిమ = డిండి అని శబ్దము చేసే వాద్యము

డమరు= డమ డమ అని శబ్దము చేసే వాద్యము

ఝర్ ఝర= ఝర్ ఝ అని శబ్దాన్ని ప్రకటించే వాయిద్యము

కాహళి = బాకా అను వాయిద్యము

పటహావళి = పటాహము మొదలయిన వాయిద్యముల సమూహముతో

మృదుమర్దలాలి = మృదువైన మద్దెలల సమూహములతో

మృదంగ దుందుభి = డోలు, దుందుభి

ఢక్కికాముఖ హృద్యవాద్యక= ఢక్కా మొదలయిన మనోహరమైన వాయిద్యములతో

మధుర మంగళ నాద= తీయని శుభకరమైన వాయిద్యములతో

మేదుర విస్ఫుమర సరసగాన =గాఢంగా వ్యాపించిన సరస గానములతో

రసరుచిర సంతతసంతన్యమాన =రస భరితమై అందమై ఎప్పుడూ విస్తరించిన

నిత్యోత్సవ పక్షోత్సవ మాసోత్సవ=ప్రతి రోజూ జరిగే ఉత్సవాలు, పదిహేను రోజులకు జరుగు ఉత్సవాలు ప్రతి నెలలో జరిగే ఉత్సవాలు,

సంవత్సరోత్సవాది వివిధోత్సవ కృతానందః= సంవత్సరానికి ఒకసారి జరుగు ఉత్సవాలు మొదలయిన

రకరకాల ఉత్సవాలతో భక్తులకు ఆనందము కలుగచేయువాడు వేంకటేశ్వరుడు

తాత్పర్యము

స్వామి వారికి ప్రతి రోజూ జరిగే ఉత్సవాలు కొన్ని. పదిహేను రోజులకు జరిగే ఉత్సవాలు కొన్ని.ప్రతి నెలలో జరిగే ఉత్సవాలు కొన్ని. సంవత్సరానికి ఒకసారి జరిగే ఉత్సవాలు కొన్ని. ఈ ఉత్సవాలన్ని మడ్డు ,డిండిమము,డమరుకము ,ఝర్ఝరము,కాహళి పటాహము మొదలయిన వాయిద్యముల సమూహముతో, మృదువైన మద్దెలల సమూహములతో, డోలు, దుందుభి , ఢక్కా మొదలయిన మనోహరమైన శుభకరమైన వాయిద్యములతో సరస గానములతోరస భరితమై ఎప్పుడూ అందంగా ఉంటాయి.అటువంటి రకరకాల ఉత్సవాలతో భక్తులకు ఆనందము కలుగచేయువాడు వేంకటేశ్వరుడు

విశేషాలు

ప్రతి ఏటా స్వామికి 450 ఉత్సవాలు నిర్వహిస్తారు.

వేకువ సుప్రభాతం నుంచి ఏకాంత సేవ వరకు నిత్య సేవల్లో స్వామి భక్తకోటికి దర్శనమిస్తూ పరవశింపచేస్తాడు.

ఇక సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజుకో ప్రత్యేక సేవలో స్వామి వైభవ ప్రాశస్త్యాన్ని వర్ణించటానికి మాటలు చాలవు.

ప్రతి సోమవారం ఉదయం జరిగే ప్రధానసేవ విశేషపూజ

శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీ మలయప్పకు ప్రతి సోమవారం ఉదయం జరిగే ప్రధానసేవ విశేషపూజ. ఆలయంలోని నిత్య కల్యాణోత్సవ మండపంలో దీనిని ఆర్జిత సేవగా నిర్వహిస్తున్నారు.

ఉభయ దేవేరులతో స్వామి శ్రీపీఠం (తిరుచ్చి)పై ఆశీనులై ఛత్రచామర బాజాభజంత్రీలు, వేద పారాయణలతో ఆనంద నిలయాన్ని విడి కల్యాణోత్సవ మండపానికి చేరుకుంటారు.

ఉత్సవమూర్తులకు అలంకారాలు, పట్టువస్త్రాలు సడలిస్తారు. స్నానవస్త్రాలు ధరింపచేసి స్నానపీఠంపై తూర్పు ముఖంగా వేంచేపు చేస్తారు.

దీక్షాధారులైన వైఖానస అర్చకులు వేదికపై నవకలశాలను, హోమగుండంలో అగ్నిని ప్రతిష్ఠిస్తారు. పుణ్యాహవచనంతో స్థల శుద్ధి, పరిసర శుద్ధి చేస్తారు. కంకణ ప్రతిష్ఠ చే సి ఉత్సవమూర్తులకు అర్ఘ్యపాద్యాచమనాది ఉపచారాలతో కంకణాలు సమర్పిస్తారు.

ఆర్జితం చెల్లించిన గృహస్తులతో సంకల్పం చేయిస్తారు. నవకలశ పూజ నివేదన, పూర్ణాహుతి సమర్పిస్తారు. ఆ హోమ తిలకాన్ని ఉత్సవమూర్తులకు ధరింప చేస్తారు. అనంతరం భక్తులకూ పంచిపెడతారు.

తర్వాత స్నానపీఠంపై శ్రీదేవి, భూదేవి, మలయప్పను వేంచేపు చేసి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.

మంగళవాయిద్యాలు, వేదఘోష నడుమ శుద్ధజలంతో అభిషేకం నిర్వహిస్తారు. తర్వాత ఆవుపాలతో, ఆ తర్వాత శుద్ధజలంతో అభిషేకించి ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తారు. ఈ సమయంలో వేదపండితులు పురుష సూక్తం, శ్రీసూక్తం, భూ నీలా సూక్తాలు, పంచ సూక్తాలు పఠిస్తారు.

చివరగా నవకలశాలలోని జలంతో సహస్రధారాభిషేకం చేస్తారు. ఆ జలాన్ని అర్చకులు తాము ప్రోక్షణ చేసుకుని, భక్తులకూ ప్రోక్షణ చేస్తారు.

అనంతరం తెరల మాటున ఉత్సవమూర్తులను నూత్నవస్త్రంతో తుడిచి పట్టువస్త్రం, పూలమాలతో అలంకరిస్తారు. పెద్దవడలు, లడ్డూలు, అన్నప్రసాదాలు నివేదిస్తారు. తెరలు తీసి కర్పూర నీరాజనం సమర్పిస్తారు. హారతి అయిన తర్వాత సేవలోపాల్గొన్న భక్తులకు ఉత్తరీయం లేదా రవిక గుడ్డ,పెద్దలడ్డూ, వడ అందజేస్తారు. చివరగా భక్తులందరికీ మూలవిరాట్టు దర్శనభాగ్యాన్ని కల్పిస్తారు. టికెట్టు ధర రూ.600.

అష్టదళ పాదపద్మారాధన-

తిరుమల తిరుపతి దేవస్థానం (1933- 1984) ఆవిర్భవించి యాభైఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 1984లో స్వర్ణోత్సవాలు నిర్వహించారు. అందుకు గుర్తుగా ఈ అష్టదళ పాద పద్మారాధన సేవను ప్రారంభించారు. ఇందుకు అవసరమైన 108 బంగారు కమలాలను హైదరాబాద్‌కు చెందిన ఓ మహ్మదీయ భక్తుడు స్వామికి కానుకగా సమర్పించారు.

* సేవకు ముందుగా ఆర్జితసేవ గృహస్తులను 'కులశేఖరపడి' గడప నుండి బంగారువాకిలి వరకు కూర్చోబెడతారు.

* అర్చకులు గర్భాలయ మూలమూర్తికి అర్ఘ్యపాద్యాచమనాది ఉపచారాలు సమర్పిస్తారు. స్వామి పాద పద్మాల చెంత కూర్చుని అర్చనకు సిద్ధమవుతారు. ఆలయ పెద జియంగార్ అందించిన బంగారు పద్మాలను స్వీకరించి అష్టోత్తర శతనామాలతో స్వామి పాదపద్మాలకు అర్చన చేస్తారు.

* స్వామి పాదపద్మాలపై ఉన్న తులసిదళాలను స్వీకరించి వక్షస్థలంలో కొలువైన శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని చతుర్వింశతి నామావళితో అర్చన పూర్తి చేసి గంధధూపం సమర్పిస్తారు. ఆవునేతి తో తడిపిన 27 వత్తులు గల వెండి దీపపుసెమ్మెతో స్వామికి నక్షత్రహారతి, నైవేద్యాలు సమర్పిస్తారు. కర్పూర నీరాజనంతో స్వామి పాదపద్మాలు, వైకుంఠ హస్తం, చక్రం, స్వామి ముఖారవిందం, తిరునామాలు, శంఖం, కటిహస్తం, పాదపద్మాలు, నందక ఖడ్గం, వక్షస్థల మహాలక్ష్మికి సమర్పిస్తారు.

* ఆర్జిత గృహస్తులకు ఉత్తరీయం లేదా రవిక గుడ్డ, రెండు పెద్ద లడ్డూలు, రెండు వడలు అందజేస్తారు. టికెట్టు రూ.1250.

సహస్ర కలశాభిషేకం

* తిరుమల ఆలయంలో నిర్వహించే సేవల్లో సహస్ర కలశాభిషేకం అత్యంత ప్రాచినమైన, విశిష్టమైన సేవగా చెప్పవచ్చు. ప్రతి బుధవారం బంగారు వాకిలిలో ప్రధాన సేవగా నిర్వహిస్తారు.

* ఆలయంలో మూలమూర్తి (ధ్రువమూర్తి), మనవాళప్పెరుమాళ్ (భోగశ్రినివాసమూర్తి), కొలువు శ్రినివాసమూర్తి, ఉగ్రశ్రినివాసమూర్తి, మలయప్ప... ఐదు రకాల మూర్తులను పంచబేరాలుగా పిలుస్తారు.

* సహస్ర కలశాభిషేకంలో భోగ శ్రినివాసమూర్తిలోపాటు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప, స్వామివారి సేనాధిపతి విష్వక్సేనుడు పాల్గొంటారు.

* క్రీ.శ.614 నాటిదిగా భావించే శ్రీ భోగ శ్రినివాసమూర్తిని వైఖానస ఆగమం ప్రకారం కౌతుకమూర్తి అని, పురుషబేరం అని పిలుస్తుంటారు.

* గర్భాలయంలో మూలమూర్తికి ఈశాన్యదిశలో ఉండే భోగ శ్రినివాస మూర్తికి నిత్యం ఆకాశగంగ తీర్థంతో అభిషేకిస్తారు. ఎప్పుడూ బంగారు వాకిలి దాటి బయటకు తీసుకురారు. సహస్ర కలశాభిషేకం కోసం ఒక్క బుధవారం మాత్రమే గంటామండపానికి తీసుకొస్తారు.

* దక్షిణదిశలో స్నానపీఠంపై ఉత్తరాభిముఖంగా ఉభయదేవేరులతో మలయప్ప, ఉత్తరదిశలో స్నానపీఠంపై దక్షిణాభిముఖంగా విష్వక్సేనులవారిని వేంచేపు చేస్తారు. వీరికి మధ్యలో తూర్పున అభిముఖంగా శ్రీ భోగ శ్రీనివాసమూర్తిని ఆసీనుల్ని చేస్తారు. ఆయనకుగర్భాలయ మూలవిరాట్టును అనుసంధానిస్తూ బంగారు తీగ లేదా పట్టుదారంతో కడతారు. దీనినే 'సంబంధ కూర్చం' అంటారు.

* నేలపై ధాన్యం (వడ్లు)పోసి, 1008 వెండికలశాలను సుగంధద్రవ్యాలు కలిపిన జలంతో నింపి ప్రతిష్ఠిస్తారు. విష్వక్సేనుడి పక్కన 'నవకలశాలు' ఏర్పాటు చేస్తారు. ఆగ్నేయదిశలో 'యజ్ఞవేదిక' ఏర్పాటు చేస్తారు. ఆర్జితసేవాగృహ స్థులను ఆసీనుల్ని చేస్తారు.

* మంగళ ధ్వనుల నడుమ దీక్షాధారులైన వైఖానస అర్చకులు ఘంటానాదంతో హోమగుండంలో అగ్నిప్రతిష్టాపన చేస్తారు. కలశాన్ని ప్రతిష్టించి పుణ్యతీర్థ జలాలు ఆవాహనం చేసి ధూపదీప కర్పూర నీరాజనాలిచ్చి అక్షతారోపణం చేస్తారు. కలశంలోని పవిత్ర జలాన్నిఅన్ని వైపులా చల్లుతూ పుణ్యాహవచనం పూర్తి చేస్తారు.

* శ్రీ భోగ శ్రీనివాసమూర్తికి అర్ఘ్యపాద్యాచమనాది అనుష్టాన క్రియలు, తులసి సమర్పించి కంకణధారణ చేస్తారు. తర్వాత శ్రీదేవి, భూదేవి, మలయప్ప, విష్వక్సేనులవారికి కంకణధారణ చేస్తారు.

* సంకల్పసహితంగా ముక్కోటి దేవతలను ఉద్దేశించి హోమం చేస్తారు. ధాన్యంపై ప్రతిష్టించిన సహస్ర కలశాలు, పీఠంపై ప్రతిష్టించిన నవకలశాలకు ఆవాహనాది క్రియలు చేసి ధూపదీప హారతులు సమర్పిస్తారు.

* హోమగుండం వద్ద అప్పాలు, శుద్ధాన్నం నివేదన చేసి హోమాన్ని నిర్వహిస్తూ పూర్ణాహుతి చేస్తారు. హోమ తిలకాన్ని శ్రీభోగ శ్రీనివాసమూర్తి, శ్రీదేవి, భూదేవి, మలయప్ప, విష్వక్సేనులవారికి సమర్పిస్తారు. భక్తులకూ అందజేస్తారు.

* మంగళవాయిద్యాలు, వేద పండితుల పంచసూక్తాల నడుమ సహస్ర కలశాలలోని శుద్ధజలం, పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనద్రవ్యాలతో భోగ శ్రీనివాసమూర్తికి, విష్వక్సేనులవారికి అభిషేకిస్తారు. చివరగా అన్ని మూర్తులకు తులసిమాలలు అలంకరించి నవకలశాలలోని జలంతో బంగారుపళ్లెంలో సహస్రధారాభిషేకం చేస్తారు.

* తర్వాత ఆ పవిత్రజలాన్ని ముందుగా అర్చకులు చల్లుకుని, జీయంగార్, ఏకాంగి, భక్తుల మీద చల్లుతారు. తర్వాత తెరలమాటున పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరించి, క్షీరాన్నం, అప్పాలతో నివేదన సమర్పిస్తారు. అనంతరం తెరలు తొలగించిఅక్షతారోపణతో కర్పూర నీరాజనం సమర్పించి మూర్తులను ఆనంద నిలయంలోకి వేంచేపు చేస్తారు. చివరగా భక్తులకు మూలవిరాట్టు దర్శన భాగ్యాన్ని కల్పించి, ఉత్తరీయం లేదా రవికగుడ్డ, పెద్దలడ్డూ, వడ, రెండు అప్పాలు, రెండు దోశలు, అన్నప్రసాదాలుఅందజేస్తారు. టికెట్టు ధర రూ.850.

నేత్ర దర్శనం

తిరుమల క్షేత్రంలో ప్రతి గురువారం ఓ విశి ష్టత ఉంది. మూలమూర్తి దర్శనం, నివేదనలు, అలంకారాలు ఈ రోజు విభిన్నంగా ఉంటాయి. ప్రతి గురువారం వేకువ జామున రెండవ అర్చన తర్వాత మూలమూర్తి ఎలాంటి ఆభరణాలు, అలంకారాలులేకుండా నిరాడంబర రూపంతో దర్శనమిస్తారు.

* ఆభరణాలే కాకుండా నొసటన పెద్దగా ఉండే పచ్చ కర్పూరపు తిరునామం (ఊర్ధ్వపుండ్రాలు) బాగా తగ్గిస్తారు. భక్తులకు స్వామి నేత్రాలు దర్శించుకునే మహద్భాగ్యం ఆ రోజు మాత్రమే కలుగుతుంది. గురువారం నాటి ఈ దర్శనాన్నే నేత్రదర్శనం అంటారు.

* ఆ రోజు ఆభరణాల బదులు పట్టుధోవతిని, పట్టు ఉత్తరీయాన్ని ధరింపజేస్తారు. స్వామివారి శిరస్సుపై కిరీటాన్ని తీసి పట్టువస్త్రాన్ని చుడతారు. బంగారు శంఖుచక్రాలు, కర్ణభూషణాలు, సాలిగ్రామహారాలను అలంకరిస్తారు. మెడలో హారం, కాళ్లకు కడి యాలు, పాదాలకు బంగారు లొడుగులు అలంకరిస్తారు.

అన్నరాశి నైవేద్యమే తిరుప్పావడసేవ

* శ్రీవేంకటేశ్వర స్వామివారికి ప్రతి గురువారం రెండో అర్చన తర్వాత నివేదనోత్సవాన్ని నిర్వహిస్తారు. దీనినే 'తిరుప్పావడసేవ' అని, అన్నకూటోత్సవం అని అంటారు. స్వామికి బంగారువాకిలి వద్ద నుండి నేరుగా సమర్పించే అన్ననివేదన ఇది.

* బంగారు వాకిలి ముందు గరుడాళ్వారుకు ఎదురుగా నాలుగు స్తంభాల మధ్య వెదురు చాపలపై 6 బస్తాల బియ్యం (450 కిలోలు) తో తయారు చేసిన పులిహోరను 'రాశి'గా పోస్తారు. స్తంభాలకు చుట్టూ తెరలు కట్టి ఈ అన్నరాశిని పెద్ద శిఖరం లాగా దానికి చుట్టూఎనిమిది దిక్కులా చిన్న శిఖరాలు గా తీర్చిదిద్దుతారు. ఈ రాశి ముందు ధూపదీప నైవేద్యాలు, నిరాజనం సమర్పిస్తారు.

* జిలేబి, తేనెలొళ (మురుకు), దోసె, అప్పలం, పాయసం, లడ్లు, వడలు వంటి ప్రసాదాలను మూలవిరాట్టు దృష్టి పడేలా కులశేఖరపడి వద్ద ఉంచి నైవేద్యం, మంగళహారతి సమర్పిస్తారు.

* వేద పండితులు శ్రావ్యంగా పఠించే శ్రీనివాస గద్యంతో సప్తగిరులు పులకిస్తాయి. శ్రీనివాసగద్యం పూర్తికాగానే బంగారువాకిలి నుండే మూలమూర్తికి, తర్వాత అన్నరాశికి హారతి సమర్పిస్తారు. . తర్వాత పులిహోర రాశిని భక్తులకు వితరణ చేస్తారు. గృహస్థులనుమూలవిరాట్టు దర్శనానికి అనుమతిస్తారు.

* ఈ సేవలో పాల్గొన్న గృహస్థులకు ఉత్తరీయం, రవికగుడ్డ, ప్రసాదాలు అందజేస్తారు. టికెట్ ధర రూ.850.

పూలంగి సేవలో పెరుమాళ్లు...

* ప్రతి గురువారం సాయంత్రం మూలవిరాట్టుకు నిర్వహించే తోమాల సేవనే పూలంగి సేవ అంటారు.

* సాయం సమయంలో వైఖానస అర్చకులు శుచిస్నాతులై సన్నిధిగొల్ల వెంటరాగా ఆలయానికి చేరుకుంటారు.

* జీయంగార్లు, ఏకాంగి 'యమునోత్తరై' అను 'పూల అర'లో సిద్ధంగా ఉంచిన పూలు, పూలమాలల్ని పెద్ద వెదురుబుట్టలను బాజా భజంత్రీల లో, ఛత్రచామర మర్యాదలతో సన్నిధికి ఊరేగింపుగా తీసుకొస్తారు.

* అర్చకులు స్వామికి అలంకరించిన ఆభరణాలు తీసివేసి, బంగారు తిగెలతో కూడిన ముఖమల్ వస్త్రాన్ని ధరింప చేస్తారు. అర్ఘ్యపాద్యాచమనాది ఉపచారాలు సమర్పించి పూలంగి, తోమాల సేవలు నిర్వహిస్తారు. జీయంగార్లు, వైష్ణవాచార్యులు, దివ్యప్రబంధాన్నిగానం చేస్తారు.

* పూలమాలల్ని శిరస్సు నుంచి పాదాల వరకు అలంకరిస్తారు. ఈ అలంకరణలో స్వామివారు పూల అంగీని ధరించినట్టు కనువిందుగా దర్శనమిస్తారు. స్వామివారు గురువారం రౌద్రంగా ఉంటారని, ఆ రౌద్రాన్ని తగ్గించి శాంతింప చేయడానికే పూలంగిసేవనిర్వహిస్తారని పండితులు చెబుతున్నారు.

దివ్యమంగళ స్వరూప దర్శన భాగ్యం!

* ప్రతి శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు బ్రహ్మముహూర్తంలో స్వామివారికి జరిగే విశేషసేవ 'అభిషేకం'.

* అర్చకులు మూలవిరాట్టుకు నమస్కారం చేసి, అభిషేకానికి అనుమతి ఇవ్వమని ప్రార్థించి సంకల్పం, అష్టోత్తర శతనామార్చన చేస్తారు. స్వామికి నొసటన ఉండే పచ్చకర్పూరపు నామాన్ని తగ్గించి సూక్ష్మంగా ఉంచుతారు. ఆభరణాలు, పట్టువస్త్రాలను తీసివేసి, స్నానవస్త్రంగా తెల్లని కౌపీనాన్ని ధరింప చేసి, దంతధావన అర్ఘ్యపాద్యాచమనాది ఉపచారాలు సమర్పించి శిరసాదిగా పునుగు తైలాన్ని అలది వెండి గంగాళాల్లో బంగారు బావి జలాన్ని సిద్ధం చేస్తారు.

* జీయంగార్లు, అర్చకులు గర్భాలయంలోకి చేరుకోగా, అధికారులు, భక్తులు కులశేఖర పడి నుంచి బంగారు వాకిలి వరకు కూర్చుంటారు.

* జీయంగార్, అర్చకులు స్వామికి, వక్షస్థల మహాలక్ష్మికి నమస్కరించి అభిషేక సమర్పణకు అనువుగా వరద హస్తం దగ్గర నిలుస్తారు.

* తొలుత జీయంగార్లు బంగారు శంఖంలో ఆకాశగంగ తీర్థాన్ని అర్చకులకు అందిస్తారు. వారు పురుష సూక్తాన్ని పఠిస్తూ స్వామి శిరస్సుపై అభిషేకిస్తారు. వేద పండితులు పంచసూక్తులు, పంచోపనిషత్తులు పారాయణం చేస్తారు.

* తర్వాత ఆవుపాలతో శిరసాది పాదాల వరకు అభిషేకిస్తారు. తర్వాత బంగారు బావి శుద్ధజలంతో అభిషేకించి, పసుపు ముద్దలను వక్షస్థల మహాలక్ష్మికి సమర్పిస్తారు.

* అనంతరం స్వామికి కర్పూరం, చందనం, కుంకుమపువ్వు శిరసాదిగా అద్దుతారు. ఈ నలుగు విధానాన్ని 'ఉద్వర్తనం' అంటారు. ఆ తర్వాత ఇచ్చే హారతిలో ముఖారవిందం, శంఖుచక్రాలు, వరద కటి హస్తాలు, పాదాలు, నందక ఖడ్గం,

వక్షస్థల మహాలక్ష్మి.. ఇలాఅంగాంగాలతో స్వామి దివ్యమంగళ రూపాన్ని భక్తులు దర్శించి ఆనంద పరవశులవుతారు. జలాభిషేకంతో జాలువారుతున్న తీర్థాన్ని 'శ్రీపాద తీర్థం' అంటారు. అనంతరం స్వామి వక్షస్థలంలో కొలువైన శ్రీ మహాలక్ష్మికి అభిషేకం చేస్తారు. తరువాత బంగారు బావిజలంతోనూ, ఆకాశగంగ తీర్థంతోనూ స్వామిని అభిషేకించి ఆ తీర్థాన్ని పాత్రలో సేకరిస్తారు.

* ఈలోగా పండితులు వేద పారాయణం పూర్తి చేస్తారు. తెరవేసి వస్త్రంతో స్వామికి తడిలేకుండా తుడుస్తూ ఉండగా జీయంగార్ ద్రవిడ వేదంలోని 'నీరాట్టం' పది పాశురాలు గానం చేస్తారు.

* ఆ సమయంలో అర్చకులు తెరలమాటున స్వామికి సరిగంచు పెద్ద పట్టువస్త్రాన్ని అంతరీయంగాను, పండ్రెండు మూరల పట్టువస్త్రాన్ని ఉత్తరీయంగానూ ధరింప చేస్తారు. తర్వాత ఆభరణాలు అలంకరించి పట్టువస్త్రంతో శిరస్సుకు కిరీటంగా చుడతారు. నుదుటపచ్చకర్పూరంతో తిరునామం తీర్చిదిద్దుతారు.

* తర్వాత వెన్న, పంచదారతో నివేదన చేసి తాంబూలం సమర్పిస్తారు. ఆ తర్వాత 'పచ్చ కర్పూరపు హారతి' సమర్పిస్తూ తెరను తొలగించి, భక్తులకు అభిషేక తీర్థాన్ని, 'శ్రీపాదరేణువు'అనే మహాప్రసాదాన్ని వితరణ చేస్తారు. టికెట్టు ధర రూ.750.

వస్త్రాలు సమర్పించే వస్త్రాలంకార సేవ

* అభిషేకసేవలో మూలవిరాట్టుకు ధరింప చేసే వస్త్రాలను భక్తులే సమర్పించేందుకు ప్రత్యేకంగా వస్త్రాలంకార సేవ టికెట్టు టీటీడీ ప్రారంభించింది. టికెట్టు ధర రూ.12.250.

నిజపాదాల దర్శనం.. భక్తకోటి జన్మధన్యం

* ప్రతి శుక్రవారం శ్రీ స్వామి నిజపాదాల దర్శనభాగ్యం భక్తులకు కలుగుతుంది. అభిషేకసేవలో పాల్గొనే భక్తులతోపాటు నిజపాద సేవాటికెట్లు కలిగిన వారికీ ఈ మహద్భాగ్యం దక్కుతుంది.

ప్రతి రోజూ నిత్యకట్ల అలంకారంలో 120 రకాల ఆభరణాలు సమర్పిస్తారు.

బ్రహ్మోత్సవాలు, పర్వదినాల్లో ప్రత్యేక అలంకారాలు చేసేందుకు అదనంగా ఆభరణాలు వాడతారు. రోజూ చేసే అలంకారాన్ని నిత్య కట్ల అలంకారమని, పండుగలు, ఉత్సవాలు, ప్రముఖుల రాక సందర్భంగా చేసే అలంకారాన్ని విశేష అలంకారమని అంటారు

తెలుగు నూతన సంవత్సరాది పర్వదినమైన ఉగాది (మార్చి/ఏప్రిల్), ఆణివారి ఆస్థానం (జూలై), శ్రీవారి బ్రహ్మోత్సవం (సెప్టెంబరు/అక్టోబరు), వైకుంఠ ఏకాదశి (డిసెంబరు/జనవరి) పర్వదినాల ముందు వచ్చే మంగళవారాల్లో కోయిల్ ఆళ్వారు తిరుమంజనంనిర్వహిస్తారు. కోయిల్ ఆళ్వారు తిరుమంజనం రోజున ఆనంద నిలయం నుంచి మహాద్వారం వరకు శుద్ధ జలంతో శుద్ధి చేస్తారు. ఈ క్రమంలో నీరు, దుమ్ము, ధూళి పడకుండా ఉండేందుకు మూలమూర్తి శిరస్సు నుంచి

పాదాల వరకు ధవళ వస్త్రాన్ని కప్పుతారు. ఈవస్త్రాన్నే 'మలైగుడారం' అని అంటారు. తిరుమంజన సేవలు పూర్తకాగానే కురాలం అనే దీర్ఘచతురస్రాకారపు మఖమల్ వస్త్రాన్ని పైకప్పునకు కడతారు.

గర్భాలయంలో కేవలం అర్చకులు, పరిచారకులు, ఏకాంగులు మాత్రమే ప్రవేశించి నాలుగు గోడలు, పైకప్పునకు అంటుకున్న దుమ్ముదూళి, బూజు, కర్పూరమసిని తొలగించి, శుద్ధజలంతో శుద్ధిచేస్తారు. తిరుమంజనానికి ముందురోజే ఎక్కువ మోతాదులోనామంకోపు (సుద్దపొడి), శ్రీచూర్ణం, గడ్డకర్పూరం, గంధంపొడి, కుంకుమ కిచిలిగడ్డ ఔషధ పదార్థాలతో లేహ్యంగా తయారు చేస్తారు. భారీ గంగాళాల్లో సిద్ధం చేసిన ఈ లేహ్యాన్ని శుద్ధి చేసిన ప్రాకారాలకు లేపనంగా పూస్తారు. దీనివల్ల ప్రాకారాలు సుగంధ పరిమళాలువెదజల్లటంతోపాటు క్రిమికీటకాలు ఉండకుండా ప్రాకారం పటిష్టతకు దోహద పడతాయని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు.

వేంకటాచల క్షేత్రంలో వెలసిన శ్రీనివాసుడు బ్రహ్మదేవుడిని పిలిచి జగత్కల్యాణం కోసం తనకు ఉత్సవాలు నిర్వహించాలని ఆజ్ఞాపించాడట. ఆ ప్రకారం బ్రహ్మదేవుడు శ్రవ ణ నక్షత్రం నాటికి పూర్తయ్యే విధంగా తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించాడట. తొలిసారిగా బ్రహ్మదేవుడు ఈ ఉత్సవాలను జరిపించడం వల్ల అవి బ్రహ్మోత్సవాలుగా ప్రసిద్ధి పొందాయి.

వేంకటేశ్వరుడు అర్చామూర్తిగా ఆవిర్భవించింది ఆశ్వయుజ మాసంలో వచ్చే శ్రవణ నక్షత్ర శుభ ముహూర్తాన. అందుకే దసరా నవరాత్రులలో ఓ శుభముహూర్తాన చక్రస్నానం నాటికి తొమ్మిది రోజుల ముందు మొదలయ్యేవిధంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఇదిఅనాదిగా వస్తున్న ఆచారం. సౌర, చాంద్రమానాల్లో ఏర్పడే వ్యత్యాసం వల్ల ప్రతి మూడేళ్లకొకసారి అధిక మాసం వస్తుంది.

ఇందులో భాగంగా ఈ ఏడాది కన్యామాసం (అధిక భాద్రపదం)లో వార్షిక బ్రహ్మోత్సవం, దసరా నవరాత్రులలో నవరాత్రి బ్రహ్మోత్సవం నిర్వహిస్తున్నారు. వైఖానస ఆగమోక్తంగా వైదిక ఉపచారాల ప్రకారం ధ్వజస్తంభంపై గరుడ ధ్వజపటాన్ని ఎగురవేయటం (ధ్వజారోహణం), బలి ఆచారాలు, మహారథోత్సవం, శ్రవణ నక్షత్రంలో చక్రస్నానం, ధ్వజావరోహణం వంటివి ఈ ఉత్సవాల్లోనే నిర్వహిస్తారు.

నవరాత్రి ఉత్సవాలు మాత్రం వైదిక ఆచారాలు లేకుండా అలంకారప్రాయంగా నిర్వహిస్తారు

(ఆధారం. సాక్షి దినపత్రిక ఫన్ డే సెప్టెంబర్ 20, 2015)

30.శ్రీమదానందనిలయవిమానవాసః

సమృద్ధి కలిగిన ఆనందనిలయమను పేరుగలిగిన విమానమును నివాసము చేసుకొన్నవాడు

. స్వామి కొలువైన పవిత్ర గర్భాలయ ప్రదేశాన్ని ఆనంద నిలయం అంటారు. గర్భాలయంపై నిర్మించిన బంగారు గోపురమే 'ఆనంద నిలయ విమానం'గా ప్రసిద్ధి పొందింది.

31.సతతపద్మాలయాపదపద్మరేణుసంచితవక్షః స్థలపటువాసః

ఎప్పుడూ పద్మావతీదేవియొక్క పదములు అను పద్మాల పుప్పొడితో కూడుకొన్న సుగంధ చూర్ణము వక్షస్థలంలో కలిగినవాడు

32.శ్రీశ్రీనివాసః సుప్రసన్నో విజయతామ్.

అటువంటి శ్రీనివాసుడు దయ కలిగిన వాడై వర్ధిల్లుగాక!

33.శ్రీరంగసూరిణేదం శ్రీశైలానంతసూరివంశ్యేన

భక్త్యా రచితం హృద్యం గద్యం గృహ్ణాతు వేంకటేశానః

శ్రీ శైల అనంతార్యుల వంశములో పుట్టిన శ్రీ రంగా చార్యులను పండితునిచే భక్తితో రచింపబడిన ఈ గద్యమును వేంకటేశ్వరుడు గ్రహించుగాక !

మంగళమ్ మహత్

******